క్లుప్తంగా

ఘనంగా పరదేశప్ప తాత ఆరాధనోత్సవాలు



అట్టెకల్లులో పరదేశప్ప తాతను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పరి: మండలంలోని అట్టేకల్లులో వెలసిన అవధూత పరదేశప్ప తాత 13వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పరదేవశప్ప తాత సమాధికి గంగపూజ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పరదేశప్ప తాత పల్లకిని మేళతాళాలతో భక్తులు ఊరేగించారు. తాతను భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పరదేశప్ప తాతను దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బాధ్యతల స్వీకరణ



డాక్టర్ షేక్ అఫ్రోజ్ జాన్

చిప్పగిరి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సివిల్ అసిస్టెంట్ జనరల్ సర్జన్‌గా షేక్ అఫ్రోజ్ జాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. చిప్పగిరిలో విధులు నిర్వర్తిస్తున్న జమీల్ అహమ్మద్ ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లగా హిందూపురంలో పనిచేస్తున్న అఫ్రోజ్ జాన్ సాధారణ బదిలీలో భాగంగా చిప్పగిరికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిస్తానని పేర్కొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన అధికారులు

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమానికి మండలంలోని బెల్డోణ గ్రామంలోలో విశేష స్పందన లభించింది. గురువారం బెల్డోణ గ్రామ సచివాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించిన వివిధ గ్రామాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చెప్పారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న, ఏఈఓ రమాదేవి, పంచాయితీ కార్యదర్శి రామాంజనేయులు సర్పంచ్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పక్కాగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

తుగ్గలి: ఉపాధి హామీ పనులు పక్కాగా చేపట్టాలని ఏపీడీ పద్మావతి సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులు, కూలీలు ఆర్థికంగా ప్రయోజనం పొందేలా పనులు గుర్తించాలన్నారు. పండ్ల తోటలు, పట్టు పురుగుల పెంపకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల హాజరు తప్పనిసరి అన్నారు. పని ప్రారంభంలో హాజరు వేసిన తర్వాత తిరిగి నాలుగు గంటలకు మరోసారి హాజరు తప్పకుండా నమోదు చేయాలన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో కూలీల హాజరు నమోదు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి కూలీలు వలసలు వెళ్లకుండా చూడాలన్నారు. అనంతరం ఉపాధి పనుల నిర్వహణపై ఏపీఓ రామకృష్ణ, ఈసీ ప్రదీప్‌కు మార్ మేట్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో తుగ్గలి, మద్దికెర మండలాల టీఏలు పాల్గొన్నారు.

8 నుంచి వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర

కృష్ణగిరి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 8 నుంచి 15వ తేదీ వరకు వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేర్చేలా ఈ యాత్ర సాగుగుతుందన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా అన్ని శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారన్నారు. యాత్ర ప్రతి రోజు ఉదయం ఒక గ్రామ పంచాయతీలో, సాయంత్రం మరో గ్రామ పంచాయతీలో నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 8న టి.గోకులపాడు, తొగర్చేడు, 9న అమకతాడు, కంబాలపాడు, 10న కృష్ణగిరి, ఎరుకలచెరువు, 11న పోతుగల్లు, ఆగవేలి, 12న చుంచుఎర్రగుడి, లక్కసాగరం, 13న కోయిలకొండ, చిట్యాల, 14న కటారుకొండ, బోయబొంతిరాళ్ల, 15న ఎస్‌హెచ్ ఎర్రగుడి, ఆలంకొండ గ్రామాల్లో యాత్ర ఉంటుందని తెలిపారు. సూపరింటెండెంట్ రామస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పెద్దనేలటూరులో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరులో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, పార్టీ శ్రేణులు



పెండేకల్లులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోతుగల్లులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి



మద్దికెరలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు

జగనన్నతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ దశరథరామయ్య, గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సచివాలయం-2లో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీగా వెళ్లి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం -1,-2 పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.40.35 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. అన్ని వర్గాల వారికి అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు చాంద్‌బాషా, విరుపాక్షిరెడ్డి, అతావుల్లా, యల్లమ్మ, షేక్ అహ్మద్, తిమ్మప్ప, కేతం నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు 12వ వార్డు సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, నజీర్‌అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, వార్డు కౌన్సిలర్ ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ సచివాలయం-2లో జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ సోమన్న ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శి నరసమ్మ, ఎంపీటీసీ లోకనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగలదిన్నెలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

తుగ్గలి: అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా పెండేకల్లు గ్రామానికి రూ.19.37 కోట్ల లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అట్ల బసిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. గురువారం గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈఓఆర్డీ తిరుపాల్, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేశ సుభాషిణి అన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్‌లు తెలుగు వాణీశ్రీ, అంజినమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడుతో కలిసి సంక్షేమం బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింటికీ తిరుగుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని వివరించారు. గ్రామ సచివాలయ పరిధిలో రూ.33.15 కోట్లు అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. నాయకులు సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శివ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక సచివాలయం- 1 లో సంక్షేమ పథకాల బోర్డును జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ. 24.69 కోట్లు అందించినట్లు వివరించారు. ఉప సర్పంచు ప్రమీలమ్మ, కార్యదర్శి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని నల్లచెలిమల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, వెలమకూరు రామచంద్ర, లుముంబా, తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని అర్ధగేరి గ్రామంలో జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, సర్పంచ్ గురుదాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. అర్ధగేరి గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.11,60,22,096 అందించినట్లు వివరించారు. నాయకులు పరశురామ్, శ్రీనివాసులు, రంజిత్, జనార్ధననాయుడు, తిప్పారెడ్డి, ఎమ్మార్వో మల్లికార్జునస్వామి, ఈఓపీఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



నల్లచెలిమలలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న కప్పట్రాళ్ల మల్లికార్జున

ఆస్పరి: 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కైరుప్పల సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ వీరభద్రి ఆవిష్కరించారు. ఈఓఆర్‌డీ సూర్యనరసింహారెడ్డి మాట్లాడుతూ.. కైరుప్పల సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.29 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మన్న, రంగన్న, సోమన్న, బజారప్ప, నరసన్న పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి కొట్టాల గ్రామంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఈరన్న, వైస్ ఎంపీపీ-2 శ్రీరాములు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మాయమాటలు నమ్మవద్దని సూచించారు. అనంతరం సచివాలయం ఆవరణలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేశారు. ఎంపీటీసీ లలిత, నాయకులు అంజినయ్య, గోవిందు, లక్ష్మినారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



అర్ధగేరిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



మొలగవల్లి కొట్టాలలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దగోనెహాళ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ పార్టీ శ్రేణులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సంక్షేమ క్యాలెండర్లు, రిసిప్ట్‌లను అందజేశారు. ప్రజలు గత ప్రభుత్వాల పాలన, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కరువుపై త్వరలో కేంద్ర బృందం పరిశీలన

పత్తికొండ రూరల్: కర్నూలు జిల్లాలో కరువు స్థితిగతులపై కేంద్ర కరువు బృందం పర్యటనకు రూట్ మ్యాపును జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి గురువారం పరిశీలించారు. పత్తికొండ సబ్‌డివిజన్ పరిధిలోని పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి మండలాల పరిధిలోని పంట పొలాలను పరిశీలించారు. కేంద్ర బృందం పర్యటనకు నివేదికలు సిద్ధం చేయాలనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చినట్లు ఆమె విలేకరులకు తెలిపారు. ఆమెతో పాటు జేడీఏ కార్యాలయం ఏడీఏ బాలవర్ధిరాజు, పత్తికొండ ఏఓ వెంకట్రాముడుతో పాటు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఎండిపోయిన ఆముదం, కంది పంటలను గురువారం జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కరువు నివేదికలు సిద్ధమయ్యాయని తెలిపారు. మండలంలో సుమారుగా 50 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. అలాగే త్వరలోనే కరువు బృందం పర్యటిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతిరైతుకు పంట నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏఓ సురేష్‌బాబు, మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ మల్లికార్జున వెంట ఉన్నారు.



కప్పట్రాళ్ల వద్ద ఎండిన ఆముదం పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గొల్ల కేశన్న

ఎమ్మిగనూరురూరల్: ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల అధ్యక్షుడు గొల్ల కేశన్న సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండలాధ్యక్షుడు గొల్ల కేశన్న అధ్యక్షతన 9వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధశాల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. దేవబెట్ట సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, సోగనూరు సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, పార్లపల్లి ఎంపీటీసీ వీరేష్, సోగనూరు ఎంపీటీసీ మదుసుధన్ రెడ్డి, కె.తిమ్మాపురం ఎంపీటీసీ విజయలక్ష్మీ తమ గ్రామ పంచాయతీల్లో తాగునీటి, రహదారులపై అధికారులను ప్రశ్నించారు. భూముల రీసర్వేలో కొందరు వీఆర్వోల తప్పిదం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పడంతో తహసీల్దార్ ఆంజనేయులు స్పందిస్తూ సమస్యలను తన దృష్టి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ గొల్ల కేశన్న మాట్లాడుతూ.. వివాదాలకు తావులేకుండా భూసమస్యలు పరిష్కరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో తాగునీరు, పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు పొలయ్య, ప్రత్యేకాధికారి డాక్టర్ సుబ్రమణ్య చారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు స్వతంత్రంగా, వినూత్నంగా ఆలోచించాలని ఏపీఈఎండీపీ జిల్లా నిర్వాహకుడు గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సూదేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఏస్‌ఏ, ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి తగు సూచనలిచ్చారు. విద్యార్థులు తయారు చేసిన చెట్‌పట్ నమ్కీన్ కారం చుట్టల ప్రాజెక్ట్ ఆకర్శణీయంగా నిలిచింది. హెచ్‌ఎం వరలక్ష్మి, డీఎస్‌ఓ రంగమ్మ కార్యక్రమ ఫెసిలిటేటర్ నాగమణిని అభినందించారు. విద్యార్థులు సృజనాత్మకత పెరిగేలా, సమస్యల పరిష్కారం చూపేలా, విమర్శనాత్మక ఆలోచలతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేలా, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా కృషి చేయాలని వారు సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

గోనెగండ్ల: స్వర్గీయ పెద్ద రంగస్వామి స్మారకంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఆంధ్ర కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలు కుబేర్ నాయుడు, జాకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో వారు మాట్లాడుతూ ఈనెల 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో 13 జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి ఉన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామానికి చెందిన వెంకన్న (55) అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా చుట్టుపక్కల వారు గమనించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పన్నులు వసూలు చేయండి

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీలో ఇంటి, కొళాయి, షాపుల పన్నులు వంద శాతం వసూలు చేయాలని డీఎల్‌పీఓ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం డీఎల్‌పీఓ శ్రీనివాసులు గోనెగండ్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ ఏడాది వంద శాతం పన్నులు వసూలు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సూచనలు చేశారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈఓఆర్డీ నాగేష్, ఈఓ సతీష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఈ నెల 24వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస రావ్ తెలిపారు. ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

హెల్త్ క్లినిక్‌ను పూర్తి చేయండి

మద్దికెర: మారుమూల ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని, సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో భవన నిర్మాణం పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆస్పరి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని గురువారం ఆస్పరి ఏఓ కార్యాలయంలో ఆలూరు ఏడీఏ సునీతకు సీపీఐ నాయకులు విరుపాక్షి, క్రిష్ణమూర్తి, ఉరుకుందప్ప, లక్ష్మన్న వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, వేరుశనగ పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు పెట్టుబడులు కూడా దక్కలేదన్నారు. రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.50 వేలు ఇవ్వడమే కాకుండా బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరారు.

3 నుంచి వ్యవసాయ సదస్సు

ఎమ్మిగనూరురూరల్: అగ్రిటెక్ వ్యవసాయ సదస్సు-2023 వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ గురువారం తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించన్నుట్లు చెప్పారు. గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణం, లాఫారంలో ఈ సదస్సు జరుగుతుందని, వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, నూతన వంగడాలతో పాటు వివిధ పంటల గురించి ప్రదర్శన ఉంటుందన్నారు. రైతులు, రైతు సంఘాలు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మా భూములు మాకు ఇప్పించండి

తుగ్గలి: తమ భూములను ఇతరుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని గురువారం బొల్లవానిపల్లి రైతులు తహసీల్దార్ రవికి విన్నవించారు. 257 సర్వే నంబరులో 2016 వరకు తమపేరిట 3.85 ఎకరాల భూమి ఉందని కదిరమ్మ, లాలెప్ప తెలిపారు. 2017లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమిలోని 1.30 ఎకరాలను తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని బాధిత రైతులు తమ డాక్యుమెంట్లను తహసీల్దార్‌కు చూపించి న్యాయం చేయాలని కోరారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు రైతులు రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి 442 సర్వే నంబరులో 2017 వరకు తమ పేరిట ఉన్న 1.18 ఎకరాల భూమి మిగులు భూమిగా చూపిస్తున్నారని విచారణ చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయండి

నందవరం: ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి నాసరరెడ్డి ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నిత్యానందరాజు ఆధ్వర్యంలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 5వ తేదీలోపు సవరణలు ఫారం-6, 7, 8లకు సంబంధించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు ఓటు నమోదు, జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించాలన్నారు. డెత్, మైగ్రేషన్ ఓటర్లకు సంబంధించి పక్కా ఆధారాలు తొలగించిన తర్వాతే ఓట్లను తొలగించాలన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ఫ్యాన్లు, ర్యాంపు తదితర సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎన్నికల సూపర్‌వైజర్లు ఎంఈఓ-2 రఘునాథ్, ఎన్నికల డీటీ గురురాజరావు, డీటీ రఘువీరా, ఆర్ఐ జెర్మియా, ఏఓ కృష్ణమూర్తి, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



నందవరంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి నాసరరెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల సీజ్

ఎమ్మిగనూరురూరల్: స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్ అవరణలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, ఆటో, స్కూల్ బస్సు డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సు, పిల్లలను తరలించే ఆటోలో కెపాసిటీకి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యజమానులు తమ బస్సులకు సీనియర్ డ్రైవర్లను నియమించుకోవాలని, నిబంధనలు పాటించని బస్సులు, ఆటోలను సీజ్ చేసి ఆర్టీఓకు పంపిస్తామని చెప్పారు. అతివేగం కాకుండా నిదానంగా వెళ్లాలని, యూ టర్న్ తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టౌన్ ఎస్ఐ రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సురేష్‌బాబు, ఏఎస్ఐలు కృష్ణయ్య, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య, పుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, దినపత్రికల గురించి గ్రంథాలయాధికారి హరి కృష్ణను అడిగి తెలుసుకొని పలు సూచనలిచ్చారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న చైర్మన్ సుభాష్ చంద్రబోస్

నిట్రవట్టిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన గుమ్మనూరు నారాయణస్వామి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నిట్రవట్టిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక చొరవ తీసుకుని జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, ఎంపీటీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే నిట్రవట్టి గ్రామంలో వడ్డె మల్లయ్య కుమారుడు శివరాజ్, అమృత వివాహ వేడుకల్లో నారాయణస్వామి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఆలూరు: విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, పోల్స్ డ్యామేజీ, అదనపు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈ నాగేంద్ర ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. జగనన్న కాలనీలలో హౌసింగ్ అధికారులు సర్టిఫికెట్లను మంజూరు చేసిన వారందరికీ విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ బకాయిలను బిల్ కలెక్టర్లు ఈ నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు.